క్లుప్తంగా

ప్రజా సేవకు అంకితంకండి



వెంకన్న గౌడ్‌ను సన్మానిస్తున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌: ఉద్యోగ విరమణ పొందిన వారు అనంతరం ప్రజాసేవకు అంకితం కావాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగి బూర వెంకన్నగౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వెంకన్న గౌడ్ దంపతులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ వెంకన్న గౌడ్ అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక పురోగతి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సిద్దిపేటజోన్‌: విద్యతోనే సామాజిక పురోగతి సాధ్యమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ పటిష్టత కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ బోధన, మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయని, విద్యార్థులు కష్టపడి చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

గణిత నమూనాల ప్రదర్శన



నమూనాలను తిలకిస్తున్న సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్‌: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శుక్రవారం గణిత నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ప్రిన్సిపాల్ సునీత తిలకించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తాయన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరై నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు రాధిక, లక్ష్మీనరసింహారెడ్డి, సంగీత, దీపిక, రమ్య తదితరులు పాల్గొన్నారు.


నీళ్లు రావడంలేదని నిరసన



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

దుబ్బాకరూరల్‌: మండలంలోని చిట్టాపూర్‌లోని డబుల్‌బెడ్రూం ఇండ్లలోకి నీటి సరఫరా లేదంటూ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యుస్, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వంట కూడ చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల సహకారం అవసరం:



శ్రీనివాస వర్మ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో ప్లాస్టిక్ నియంత్రణకు స్థానిక నాయకులు, అధికారుల సహకారం తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసవర్మ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ పరిసరాలలోని వ్యాపారులు, హోటళ్ల నుంచి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలోనే ఆయా యజమానులతో సమావేశం నిర్వహించాలని కార్యదర్శి హరీశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పుల్లో ‘పల్లెపాలన’

- నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం
- పంచాయతీల్లో డబ్బులకు కటకట
- నిండా మునిగిన కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలో ఓ మేజర్ గ్రామ పంచాయతీలో మూడు వేలకుపైగా జనాభా ఉంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తరువాత అన్నీ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల ఏర్పాట్లు, చెత్త సేకరణ ఇలా.. వివిధ పనుల కోసం యేడాది వ్యవధిలో సుమారుగా రూ.2లక్షల పైగా ఖర్చయింది. పంచాయతీ కార్యదర్శి అప్పుచేసి గ్రామంలో ఈ పనులు చేపట్టారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు.

ఇదీ.. పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంఘం, ఫైనాన్స్ కమిషన్ నుంచి పంచాయతీలకు నిధులు విడుదల చేస్తుంటాయి. ఇంటి పన్నులు, ఇతర వసూళ్లతో గ్రామాలు నిధులు సమకూర్చుకొంటాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. వారే సొంతంగా గ్రామాల్లోని ఆయా పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు.



అంతక్కపేట పంచాయతీ కార్యాలయం

బతుకమ్మ బిల్లులు రాలే..

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో ఏ గ్రామాల్లో దసరా, బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు ఖర్చుచేసిన డబ్బులు ఒక్కపైసా కూడా రాలేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అదేవిధంగా గతేడాది వేసవిలో మోటార్లు, తాగునీరు తదితరాలకు ఖర్చుచేసిన డబ్బులు సైతం జమకాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సరఫరా నిర్వహణ కింద వచ్చే నిధులు కూడా యేడాదిగా చెల్లించలేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.70 లక్షలపైగా..

మండలంలోని ఒక్కో పంచాయతీ కార్యదర్శి యేడాదిగా రూ.50వేల వరకు ఖర్చు చేశారు. మేజర్ పంచాయతీలలో రూ.1 లక్ష నుంచి రూ.2.50లక్షల పైగా అప్పులు చేసి పంచాయతీల పనులకు ఖర్చు చేశారు. మొత్తంగా 31 పంచాయతీల్లో దాదాపుగా రూ.70 లక్షల పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

నిధుల కొరతపై నివేదిస్తాం



గ్రామ పంచాయతీలకు నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. జిల్లాలో 82 శాతం ఇంటిపన్ను వసూళ్లు చేశాం. అందులో నుంచే కొంత ఖర్చు పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. పంచాయతీ కార్యదర్శులు కొంత మేరకు ఖర్చులు చేసినట్లు చెబుతున్నారు. వారు ఖర్చు చేసిన వివరాలను ఎంపీడీఓ, ఎంపీఓల ద్వారా తీసుకొని కలెక్టర్, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

– దేవకీ దేవి, జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)

రెడీమేడ్ దుస్తుల వల్ల ఉపాధి కోల్పోయాం



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మేర సంఘం సభ్యులు

- దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి
- టైలర్స్‌డే సందర్భంగా ర్యాలీ

గజ్వేల్‌రూరల్‌: రెడీమేడ్ దుస్తుల వల్ల ఉపాధిని కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని మేర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ టైలర్స్‌డే సందర్భంగా శుక్రవారం అంగడిపేట హనుమాన్ దేవాలయం నుంచి ఇందిరా పార్కు చౌరస్తా అక్కడి నుంచి కోర్టు వరకు ట్రాలీ ఆటోలో కుట్టు మిషన్‌ను ఏర్పాటుచేసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే గతంలో కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించినప్పటికీ.. నిర్మాణానికి నిధులను మంజూరు చేయలేదని వాపోయారు. దానిని పూర్తిచేయాలని, డబుల్‌బెడ్రూంలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిస్కిన్‌బాబు, బాల్‌రాజు, మల్లేశం, శ్రీనివాస్, బాలకిషన్, భాస్కర్, ధనుంజయ్, నాగరాజు, స్వామి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లిలో..

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని తంగళ్లపల్లిలోని వేణుగోపాలస్వామి (కిష్టస్వామి దేవస్థానం) ఆలయ ఆవరణలో టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. టైలర్స్ యూనియన్ సభ్యులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణంరాజు, ఆంజనేయులు, తుమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటీ నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దు



రవీందర్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతులు

ఎస్‌ఈకి రైతుల వినతిపత్రం

నంగునూరు(సిద్దిపేట): కమలాయపల్లి వద్ద ఓటీ(ఆఫ్‌టెక్) నిర్మాణానికి అనుమతులివ్వొద్దని మండలంలోని పది గ్రామాల రైతులు శుక్రవారం ఇరిగేషన్ ఎస్‌ఈ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద ఓటీ నిర్మాణం చేపట్టి రంగనాయకసాగర్ నీటిని కుడి కాలువ ద్వారా దూల్‌మిట్ట, జాలపల్లి, అర్జున్‌పట్ల, కమలాయపల్లి నీటిని తరలించేలా అనుమతులు కోరినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని ఆయకట్టుకు తపాస్‌పల్లి ద్వారా సాగునీరు అందిస్తున్నారని, ఓటీ నిర్మాణం చేపడితే మండలంలోని మైసంపల్లి, అంక్షాపూర్, ఖానాపూర్, నాగరాజుపల్లి, నంగునూరు, అక్కేనపల్లి, ఘణపూర్, కొండంరాజ్‌పల్లి, గట్లమల్యాల, ఖాత గ్రామాల రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటీ నిర్మాణం పనులను విరమించుకోవాలని లేకుంటే బీఆర్‌ఎస్ పక్షాన రైతులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగంగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, కృష్ణారెడ్డి, నాగేంద్రం, పురేందర్, అజీద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత విద్యకు బాటలు

- ఎంఈఓ ప్రవీణ్ బాబు
- ఉత్సాహంగా స్వపరిపాలనా దినోత్సవం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతోనే ఉన్నత విద్యకు బాటలు పడతాయని ఎంఈఓ ప్రవీణ్ బాబు అన్నారు. మండల పరిధిలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం స్వపరిపాలనా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. డీఈఓగా మధుసూదన్, ఎంఈఓగా జీవన్, హెచ్‌ఎంగా అర్చన, ఉపాధ్యాయులుగా రిశిత, చైత్ర, జ్యోతిర్మయి, స్పందన, ప్రణవి, యశ్వంత్, కార్తీక్, సృజన్ వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, లోకేశ్, చంద్రశేఖర్, స్వప్న, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): స్వయం స్వపరి పాలనలో పాల్గొన్న విద్యార్థులు

రామంచ పాఠశాలలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ యాదవరెడ్డి, హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, వరప్రసాద్, లలిత, సునీత, నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.

మద్యంతాగి నడపొద్దు: సీఐ

చేర్యాల(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సీఐ ఎల్.శ్రీను వాహనదారులకు సూచించారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన 28 మందికి శుక్రవారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదం బారినపడితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. అలాగే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్‌రూట్ ప్రయాణం చేయవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ మానసరెడ్డి ఉన్నారు.

ప్లాస్టిక్ నివారించి స్టీల్ బాటిల్స్ వాడండి



వంటలను పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

హుస్నాబాద్‌రూరల్‌: విద్యార్థులు ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ బాటిల్స్ వాడితే ఆరోగ్యంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతాయని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. పోతారం(ఎస్)లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లలు సైన్స్‌డే సందర్భంగా పిల్లల ప్రదర్శనలను తిలకించారు. ఒక విద్యార్థి తయారు చేసిన రోబోను తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వండించే భోజనం, ఇతర పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలని ఆదేశించారు. నాణ్యమైన సరుకులనే వాడాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు

హుస్నాబాద్‌రూరల్‌: రైతుల పిల్లలు చదువుకుని విద్యావంతులు కావాలని రైతు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జనగామ మురళీధర్‌రావు ఆకాంక్షించారు. గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు సేవ చేయాలనే ఆలోచనతోనే రైతు సేవా సమితి స్థాపించి సేవలందిస్తున్నామన్నారు. పాఠశాలల్లోని రైతులు, కూలీల పిల్లలను ప్రోత్సహించడానికి రూ.25వేల విలువైన దుస్తులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ రాంగోపాల్‌రావు, హెచ్‌ఎం అరుణాదేవి, రాములు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ హయాంలోనే దేవాలయాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీ ఉమా మహేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉమా మహేశ్వరుని కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. మరో రెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, సర్పంచ్ లక్ష్మి తెలిపారు. ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, మాజీ కౌన్సిలర్‌లు గోపాల్‌రెడ్డి, మెట్టయ్య, ఎంపీటీసీ నరేందర్, ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

శ్మశాన వాటిక కోసం ఆందోళన

- మండిపడ్డ మల్లన్నసాగర్ భూబాధితులు
- ఐఓసీ ఎదుట ముస్లింల ఆందోళన

గజ్వేల్‌రూరల్‌: మల్లన్నసాగర్ ప్రాజెక్టు పేరుతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తమను తరలించి అధికారులు చేతులు దులుపుకొన్నారని, ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు ఎక్కడ నిర్వహించాలో తెలియక నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఎర్రవల్లి గ్రామ ముస్లింలు మండిపడ్డారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఎర్రవల్లికి చెందిన నజియా మృతి చెందగా అంతిమ సంస్కారాలు ఎక్కడ నిర్వహించాలో తెలియక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం నజియా మృత దేహాన్ని డీసీఎం వాహనంలో ఐఓసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)వద్దకు తీసుకువచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితంలేకుండా పోయిందన్నారు. అధికారులు వచ్చి సర్వేలు చేస్తూ కాలం గడుపుతున్నారే తప్ప పరిష్కారం చూపటం లేదని వాపోయారు. శ్మశాన వాటిక కేటాయించే వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని నిరసనకు దిగారు. ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. విషయం తెలుసుకున్న మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతిన్ అక్కడికి చేరి తాత్కాలిక పరిష్కారం చూపారు. నజియా మృత దేహాన్ని పట్టణంలోని వేరే శ్మశాన వాటికకు తరలించేలా చొరవ చూపడంతో గొడవ సద్దుమణిగింది.



ఐఓసీ వద్ద నిరసన తెలుపుతున్న ఎర్రవల్లి ముస్లింలు

శాస్త్రీయ దృక్పథం అవసరం



బెజ్జంకి(సిద్దిపేట): వడ్లూరు బేగంపేట ఉన్నత పాఠశాలలో..



గజ్వేల్‌రూరల్: ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): పరికరాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రమేశ్

- ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి
- ఘనంగా జాతీయ సైన్సు వేడుకలు

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆయా ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వివిధ శాస్త్రవేత్తల గురించి వివరించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. గజ్వేల్ సెయింట్ జేవియర్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



హుస్నాబాద్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి



మిరుదొడ్డి(దుబ్బాక): కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



మర్కూక్(గజ్వేల్): పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్‌రాములు



వర్గల్ నవోదయలో సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



తొగుట(దుబ్బాక): ఘనపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

సంక్షిప్త వార్తలు

◆ **సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు**

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అశోక్, అంజయ్య, భాస్కర్ డిమాండ్ చేశారు. ఫోరం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం పోస్టుకార్డులు పంపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేసి అమరులుకాగా మరికొందరు జైలు జీవితం గడిపారన్నారు. చాలా మంది ఆర్థికంగా నష్టపోయారని వారి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన హామీ మేరకు రూ.25 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు జహురొద్దీన్, రమేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్పొరేట్ పాఠశాలలపై చర్యలేవి?**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముందస్తు అడ్మిషన్‌లు తీసుకొంటున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తికాకముందే అడ్మిషన్లు నిర్వహించడం సరికాదన్నారు. అధికారులు ఆయా పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రసన్నకుమార్, అనిరుద్ పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమాన**

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమాన విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.9,500 జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

◆ **ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మల్లారెడ్డి**

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్ దుబ్బరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సోమగారి మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గ్రామస్తులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, నాయకులు కొండల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని చేబర్తికి చెందిన పేద వైద్య విద్యార్థిని కృష్ణవేణికి మర్కూక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత సహకారంతో లయన్స్ క్లబ్ స్నేహ సభ్యులు సాయిరాం, విజయసారథి రూ.70 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను శుక్రవారం అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశం, క్లబ్ సభ్యులు అమర్నాథ్‌రావు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.